క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

జీడిమెట్ల: ఈనెల 1న (నేడు) డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం ఆంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కొనసాగుతుందని జీడిమెట్ల డిపో పరిధిలోని ప్రజలకు బస్సు సౌకర్యంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే 9959226150 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, బాలాజీనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బంధ విశ్వేశ్వర్‌రావు సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఆయన పార్థీవ దేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వేశ్వర్‌రావు మృతి పార్టీకి తీరని లోటని ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఢిల్లీకి తరలిన బీసీ మహాసభ నాయకులు



సంఘీభావం తెలిపిన హిందూ బీసీ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈనెల 1న (నేడు) బీసీ నాయకులు బత్తుల సిద్ధేశ్వర పటేల్, జక్కని సంజయ్, పర్వత సతీశ్‌కుమార్, కొంగర నరహరి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నారు. దీంతో హిందూ బీసీ మహాసభ రాష్ట్ర కార్యవర్గం వారితో కలిసి సోమవారం శంషాబాద్ విమానాశ్రయం వరకు తరలివెళ్లారు. వీడ్కోలు పలికిన వారిలో ప్రచార కార్యదర్శి పంతుల మల్లయ్య, ఉపాధ్యక్షుడు బత్తుల రామ్ నర్సయ్య, కోశాధికారి వెంకట్ స్వామి, కార్యవర్గ సభ్యులు మిరియాల సతీశ్ కుమార్ నేత, మారెం రాజ్‌కమార్ యాదవ్, పుటోజు బంగార చారి ఉన్నారు.

'విద్యార్థుల అరెస్టు అన్యాయం'

ఆల్విన్‌కాలనీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను ఆదివారం రాత్రి అరెస్టు చేయడం అన్యాయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వీరమల్ల కేశవరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1974లో 2300 ఎకరాల విస్తీర్ణంలో విశ్వవిద్యాలయం స్థాపించారన్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలుకు కావాల్సిన నిధులు సమకూర్చేందుకు ఈ యూనివర్సిటీ భూములు విక్రయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. భూముల విక్రయాన్ని శేరిలింగంపల్లి ప్రజలు, విద్యార్థులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని, వారికి అండగా పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు.

ఆస్తిపన్ను కట్టలేదని.. దుకాణం ముందు గుంత తవ్వారు



చందానగర్ : ఆస్తిపన్ను బకాయిలు కట్టలేదని వాప్యారం సముదాయం ముందు జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ 21 అధికారులు జేసీబీతో గుంత తవ్వారు. దీంతో వెంటనే సముదాయం యజమాని సోమవారం బకాయి ఉన్న రూ.30 లక్షలకు గాను రూ.15 లక్షలు చెల్లించి మరో రూ.15 లక్షలు రాయితీ పొందాడని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలలోకి వెళితే.. బకాయిదారులు 2018 సంవత్సరం నుంచి ఆస్తి పన్ను చెల్లించడం లేదని పలుమార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఆదివారం గుంత తవ్వారు. దీంతో అతను కార్యాలయంకు వచ్చి రూ.15లక్షలు ఆస్తి పన్ను బకాయి చెల్లించాడు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ అల్లా దయతో వారు జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకుని సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. – కూకట్‌పల్లి (జోన్‌బృందం)

కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని ఈద్గా వద్ద ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్



ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు వెంగళరావు తదితరులు



మూసాపేటలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం తదితరులు..



ఫతేనగర్‌లో కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ తదితరులు ..



బాలానగర్‌లో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తదితరులు..



టీపీసీఎస్‌డీ జనరల్ సెక్రటరీకి.. కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేశ్ తదితరులు..



యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ సలీంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బండి రమేశ్ తదితరులు



మేడ్చల్ మైనార్టీ సెల్ అధ్యక్షుడితో కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు



ముస్లింలతో కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్



ఓల్డ్ బోయిన్‌పల్లి వల్లబ్‌నగర్ ఈద్గా వద్ద ..

సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటా

ఓల్డ్‌బోయిన్‌పల్లి: సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటానని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పీవీ ఎన్‌క్లేవ్, సమతానగర్‌లోని స్నేహ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 60వ పెళ్లి రోజు చేసుకున్న సీనియర్ సిటిజన్ జంట అప్కారి సూర్యప్రకాశ్ దంపతులతో కేక్ కట్ చేయించి శాలువాలతో సన్మానించారు. అనంతరం 80వ బర్త్‌డే చేసుకున్న రేకల శ్యామ్ సుందర్‌రావుతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నర్సింహాయాదవ్ మాట్లాడుతూ.. మొక్కగా మొదలైన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మహావృక్షంగా ఎదిగి కుర్రాకారుల్లాగా పని చేస్తుండడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, జనరల్ సెక్రటరీ సూర్యప్రకాశ్, సెక్రటరీ సుధాకర్‌రావు, సత్తయ్య, విద్యాసాగర్, అమృతరావు, విజయకుమార్, బక్కరెడ్డి, లింగం, మల్లేశ్ యాదవ్, బుర్రి యాదగిరి పాల్గొన్నారు.



వేడుకల్లో సీనియర్ సిటిజన్స్, కార్పొరేటర్ నర్సింహాయాదవ్

మౌలిక వసతుల కల్పనకు కృషి

నిజాంపేట్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కొలన్ హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. గత వారం జర్నలిస్ట్ కాలనీ మారుతీ ఎలైట్ వాసులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈమేరకు సోమవారం కాలనీలో పర్యటించారు. కమిషనర్‌తో మాట్లాడి స్థానిక సమస్యలు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, కుమార్‌యాదవ్, పితాని శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న హన్మంత్‌రెడ్డి

ఎమ్మెల్యే మాధవరం ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్మత్‌పేట కోయబస్తీలోని శ్రీ చాముండేశ్వరీ ఆలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చండీ హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రటరి మేకల హరినాథ్, నాయకులు మక్కాల నర్సింగ్‌రావు, బల్‌రాజు, నగేశ్, మక్కాల సత్యనారాయణ, మట్టి శ్రీను, అశోక్, విక్రమ్, కమల్, శేఖర్, గణేశ్, రాములు, నరసింహ, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అరగంటే..!

- పర్వత్‌నగర్ ప్రభుత్వ హాస్పిటల్ లైన్‌లో సమయపాలన లేకుండా మంచినీటి సరఫరా
- అదికూడా లోప్రెషర్‌లో..
- ఇబ్బందుల్లో స్థానికులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ ప్రభుత్వ హాస్పిటల్ లైన్‌లో నీటి సరఫరా సక్రమంగా కాకపోవడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయపాలన లేకుండా రాత్రి వేళల్లో 10 నుంచి 12 గంటల ప్రాంతంలో అది కూడా లోప్రెషర్‌గా సరఫరా చేస్తున్నారు. హైప్రెషర్‌తో నీటి సరఫరాతో పాటు సమయం పెంచాలని ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను విన్నవించిన పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. సాధారణంగా గంట పాటు సరఫరా అయ్యే తాగు నీరు అరగంట మాత్రమే వదులుతున్నారు. అంతేగాకుండా కలుషితమైన నీరు వాటితో కలిసి సరఫరా కావడంతో శుద్ధజలం మురుగు నీరుగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సమయపాలన లేకుండా నీటి సరఫరా..

సమయ పాలన లేకుండా తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో అటు పనికి వెళ్లలేక, ఇటు నీటిని పట్టుకోలేక, రాత్రి వేళల్లో జాగారణ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్ధిష్ట సమయంలో సక్రమంగా నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి. అంతేగాకుండా హై ప్రెషర్‌తో, కలుషితమైన నీరు రాకుండా శాశ్వతమైన చర్యలు చేపట్టాలి. – ఎం. రాజు, పర్వత్‌నగర్

పేకాటస్థావరంపై దాడులు

కుత్బుల్లాపూర్: పేకాట స్థావరంపై పేట్‌బషీరాబాద్ పోలీసులు దాడులు చేసి 8 మందిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని స్కైలీవ్ అపార్ట్‌మెంట్‌లో పేకాడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో అడ్డాపై దాడులు నిర్వహించారు. 8 మంది పేకాడుతూ పట్టుబడగా వారి నుంచి రూ.27,600, ఆన్‌లైన్‌లో రూ.19,200 నగదుతో పాటు 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి వారిని స్టేషన్‌కు తరలించారు.

ఇక రేషన్‌షాపుల్లో సన్న బియ్యం!

- బాలానగర్ సర్కిల్ పరిధిలో నేటి నుంచే పంపిణీ ప్రారంభం
- మొత్తం 2,04,433 రేషన్ కార్డుదారులకు లబ్ధి



కుత్బుల్లాపూర్: అధికారంలోకి వస్తే సన్నబియ్యం ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరే సమయం ఆసన్నమైంది. ఉగాది రోజున సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఈనెల 1 నుంచి అన్ని రేషన్ షాపుల్లో పంపిణీ చేసేందుకు 50 క్వింటాళ్ల చొప్పున ప్రతి దుకాణంలో అందుబాటులో ఉంచారు. బాలానగర్ సర్కిల్ పరిధిలో కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 121, 122 ,123, 124 వార్డులు రాగా ఇక్కడ మొత్తం 33 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదేవిధంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 114, 115, 116, 117, 118, 119, 120 డివిజన్లు రాగా 83 రేషన్ దుకాణాలు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గపరిధిలో 125, 126, 127, 128, 129, 130 ,131, 132 ,133 మొత్తం 8 డివిజన్‌లో 110 రేషన్ షాపులు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

1,65,865 కిలోల బియ్యం పంపిణీ

బాలానగర్ డివిజన్ పరిధిలో మొత్తం 2,04,433 రేషన్ కార్డుదారులు ఉండగా, 1,65,865 కిలోల సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే పౌర సరఫరాల శాఖ అధికారులు 50 క్వింటాళ్ల చొప్పున బియ్యాన్ని ఆయా దుకాణాలకు సరఫరా చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. డీలర్లకు పలు సూచనలు చేసి ఏమైనా ఆరోపణలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టార్గెట్‌కు మించి ఆస్తి పన్ను వసూళ్లు

రూ.57.20 కోట్లతో కుత్బుల్లాపూర్ సర్కిల్ రికార్డు

- లక్ష్యం రూ. 54.36 కోట్లు.. అదనంగా రూ 2.84 కోట్ల వసూలు

కుత్బుల్లాపూర్: ఆస్తి పన్ను వసూళ్లలో కుత్బుల్లాపూర్ సర్కిల్ కొత్త రికార్డు సృష్టించింది. టార్గెట్‌కు మించి రూ.2.84 కోట్ల ఆదాయం అదనంగా వసూలైంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ 2023–24 ఆస్తి పన్ను రూ.51.61 కోట్లు ఉండగా, 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.54.36 కోట్లుగా నిర్ణయించారు. అయితే బకాయిలతో కలిసి అంచనాలకు మించి లక్ష్యానికి అదనంగా రూ.2.84 కోట్లు వసూలై రూ.57,20 కోట్లకు చేరింది. కుత్బుల్లాపూర్ సర్కిల్ గ్రేటర్‌లో విలీనమైన తర్వాత ఇంత మొత్తంలో ఆస్తి పన్ను వసూలు కావడం రికార్డుగా అధికారులు పేర్కొంటున్నారు.





అండర్‌పాస్‌లు ఆకట్టుకునేలా..

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా చిత్రాలు

మాదాపూర్: మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ఉన్న అండర్‌పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జిల గోడలు, పిల్లర్లపై కళాకారులు అందమైన చిత్రాలను వేసి ఆకట్టుకుంటున్నారు. నగర సుందరీకరణలో భాగంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే విధంగా బతుకమ్మ, పోతురాజులు, పేరిణీ నాట్యం చిత్రాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలిపే విధంగా పిల్లర్లపై వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్, సమాజ సేవకుల చిత్రాలను వేశారు. జేఎన్‌ఎఫ్‌యూ విద్యార్థులు అయ్యప్పసొసైటీకి వెళ్లే అండర్ పాస్ బ్రిడ్జి గోడలపై నగరంలోని ప్రధాన కూడళ్లు, మార్కెట్‌ల గురించి పెయింటింగ్‌లు వేశారు. మొజంజాహీ మార్కెట్, కోఠి, సుల్తాన్‌బజార్ ఇలా 16 ప్రముఖ మార్కెట్‌ల చిత్రాలను వేశారు.

